నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ శనివారం 12 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL



## విజయీభవ

### నేటి దసరా వేడుకలకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఏర్పాట్లు



ఖానాపూర్‌లో రామలీలా ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా చెప్పుకునే విజయదశ మి వచ్చేసింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శనివారం వేడుకలు నిర్వహించుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ ప్రాంగణం, ఖానాపూర్ పట్టణంలో ప్రత్యేక పూజలు, రామ్‌లీలా(రావణదహనం) కార్యక్రమాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. **- నిర్మల్ అర్బన్, అక్టోబర్ 11**



# పండింది పది క్వింటాళ్లు.. కొంటున్నది ఆరున్నరే..

**సోయా కొనుగోళ్లపై సర్కారు నిర్లక్ష్యం**

- **తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయం**
- **తీవ్రంగా నష్టపోతున్న రైతులు**

ఆదిలాబాద్, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు, వర్షాలు సహకరించడంతో సోయా దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. కష్టపడి సాగు చేసిన ఉత్పత్తులను విక్రయించి లాభాలు పొందుదామనుకున్న రైతులకు నిరాశే మిగులుతున్నది. వానకాలంలో 71,226 ఎకరాల్లో సాయా సాగు కాగా.. 4,27,356 క్వింటాళ్ల పంట విక్రయానికి వస్తుందని అధికారులు కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. సోయా దిగుబడి ఎకరాకు పది క్వింటాళ్ల వరకు రాగా.. ప్రభుత్వం ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నది. దీంతో మిగిలిన పంటను ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకొన్నది.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన సోయాబిన్

### ఎకరాకు రూ.2 వేల వరకు నష్టం

గత శుక్రవారం నుంచే కొనుగోళ్లు ప్రారంభం కాగా.. ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ కొనుగోలు చేస్తున్నది. మద్దతు ధర క్వింటాలుకు రూ.4,892 ఉండగా.. ప్రైవేటు వ్యాపారులు రూ.4,200లకు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ యార్డుల్లో కొనుగోళ్లపై సీలింగ్ ఉండడంతో తక్కువ ధరకు దళారులకు విక్రయించాల్సి వస్తున్నది. ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్లలో కోతలు విధిస్తారు. తేమ, నాణ్యత పేరిట ధరలు తగ్గిస్తున్నారు. ఫలితంగా ఎకరాకు మూడున్నర క్వింటాళ్ల చొప్పున రూ.2 వేల వరకు నష్టపోవాల్సి వస్తున్నది. సోయాను ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని అధికారులు ప్రభుత్వానికి లేఖ రాసిన ఫలితం లేదు. తేమ విషయంలో కూడా రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో మూడ్రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. 12 శాతం తేమ ఉంటేనే సహకార సంఘాల సిబ్బంది కాంటాకు రాస్తున్నారు. ఒక శాతం ఎక్కువ ఉన్నా పంటను ఆరబెట్టాలని సూచిస్తున్నారు. దీంతో రైతులు చేసేదేమీ లేక ఆరు బయట ఎండబెడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని రైతులు తీవ్రంగా వ్యతరేకిస్తున్నారు. ఎకరాకు ఆరున్నర క్వింటాళ్ల సీలింగ్ నిబంధన సర్కారు ఎత్తి వేయాలని.. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఎకరానికి 10 క్వింటాళ్లు కొనాలి..



*నేను 20 ఎకరాల్లో సోయాబిన్ పంటను సాగు చేయగా 200 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చింది. ఆదిలాబాద్ మార్కెట్‌కు పంటను తెచ్చాను. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు కొంటామని మార్కెటింగ్ సిబ్బంది అంటున్నారు. ఈ లెక్కన నేను 130 క్వింటాళ్లు మాత్రమే విక్రయించుకునేందుకు అవకాశం ఉంది. ఇంకా 70 క్వింటాళ్లు ఎక్కడ విక్రయించాలి. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4892 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ.4300 వరకు కొంటున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు పంటను అమ్మితే క్వింటాల్‌కు రూ.600 చొప్పున నష్టపోవాల్సి వస్తున్నది. ప్రైవేటోళ్లకు పంటను ఇస్తే రూ.40 వేల వరకు నష్టం వస్తుంది. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున కొనాలి.* **- రాంరెడ్డి, రైతు, కజ్జర్ల, తలమడుగు**

### 15 క్వింటాళ్లు మిగులుతుంది..



*నాలుగెకరాల్లో సోయా వేశా. సాగులో జాగ్రత్తలు, వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 40 క్వింటాళ్ల పంటను అమ్ముదామని ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొంటామని అంటున్నారు. ఈ లెక్కన నేను 25 క్వింటాళ్ల వరకు ప్రభుత్వానికి అమ్ముకునే అవకాశం ఉంది. ఇంకా 15 క్వింటాళ్లు మిగులుతుంది. ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే రూ.14 వేల నష్టం వస్తుంది. మార్కెటింగ్ సిబ్బంది 13 శాతం తేమ ఉన్నా పంటను తీసుకోవడం లేదు. ఎండలో ఆరబెట్టాలని సూచిస్తున్నారు.* **- తిరుమలేశ్, రైతు, తంతోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం.**

### పంట మొత్తం ప్రభుత్వమే కొనాలి..



*వానకాలంలో నేను ఏడు ఎకరాల్లో సోయాబిన్ సాగు చేశాను. ఈ సారి దిగుబడి బాగా వచ్చింది. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున 70 క్వింటాళ్ల పంట వచ్చింది. పంటను విక్రయించేందుకు ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు తీసుకువస్తే ఇక్కడ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు కొంటామని అంటున్నారు. ఎందుకు అని అడిగితే సర్కారు రూల్స్ ప్రకారం అంతే కొంటామని చెబుతున్నారు. ఏడు ఎకరాలకు గానూ నేను 45 క్వింటాళ్లు మాత్రమే అమ్ముకునే అవకాశం ఉంది. ఇంకా 25 క్వింటాళ్ల పంట మిగులుతున్నది. ప్రైవేట్‌లో రేటు బాగా తక్కువ ఉంది. వాళ్లకు పంటను ఇస్తే బాగా నష్టం వస్తుంది. ప్రభుత్వం రైతులు పండించిన మొత్తం పంటను కొనాలి.*
**- దేవన్న, రైతు, బండల్ నాగాపూర్, తాంసి మండలం**

### రూ.22 వేలు నష్టపోవాల్సి వస్తుంది..



*నేను ఆరెకరాల్లో సోయా సాగు చేశా. నాలుగైదు సంవత్సరాల తర్వాత ఈ ఏడాది సోయా దిగుబడి బాగా వచ్చింది. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా వచ్చింది. ఆరెకరాల్లో 65 క్వింటాళ్ల పంట తీశా. మద్దతు ధర మంచిగా ఉండడంతో పంటను విక్రయిస్తే నాలుగు పైసలు వస్తాయని ఆశ పడ్డా. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు సోయాను అమ్మకానికి తీసుకొచ్చా. కొనుగోళ్ల విషయంలో సర్కారు నిర్ణయం రైతులను షాక్‌కు గురి చేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు కేవలం ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని కొనుగోలు కేంద్రం సిబ్బంది అంటున్నారు. ఈ లెక్కన నేను 40 క్వింటాళ్ల పంటను మాత్రమే విక్రయించే అవకాశం ఉంది. మిగిలిన ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారులకు అమ్మాలి. సర్కారు నిర్ణయం ఫలితంగా క్వింటాలుకు రూ.900 చొప్పున 25 క్వింటాళ్లకు రూ.22 వేలు నష్టపోవాల్సిన దుస్థితి నెలకొన్నది.*
**- రాము, రైతు, ఖోడద్, తలమడుగు**






### తేమ శాతం నిబంధనతో తిప్పలు

***ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో సోయా పంట కొనుగోలుకు ప్రభుత్వం విధించి తేమ శాతం నిబంధనతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. మార్కెటింగ్ సిబ్బంది పంటలతో 12 శాతం వరకు తేమ ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో రెండురోజులుగా కురిసిన వర్షాలతో సోయాలో తేమ శాతం పెరిగింది. మార్కెటింగ్ సిబ్బంది సూచనల మేరకు పంటను ఎండలో ఆరబెడుతున్నారు. పంట కొనుగోళ్లలో భాగంగా తేమ శాతంలో సడలింపు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.***
***-ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్, అక్టోబర్ 11***



ఒక్క శాతం తేమ అధికంగా ఉండడంతో పంటను ఆరబెడుతున్న రైతు

### 39వ వసంతంలోకి ఆకాశవాణి



ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం

తాంసి(భీంపూర్), అక్టోబర్ 11 : ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ఈ నెల 12వ తేదీ నాటికి 38 వసంతాలు పూర్తి చేసుకుని ఇక 39లోకి అడుగు పెడుతోంది. 1986 అక్టోబర్ 12న కేంద్రం నుంచి ప్రసారాలు ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రం తెలుగు రాష్ట్రాల్లో మొదటి, దేశం మొత్తంలో మూడో రేడియో కేంద్రం 1986లో ఏఎం పద్ధతిలో ఒక కిలోవాట్ సామర్థ్యం ట్రాన్స్ మీటర్‌తో ప్రసారాలు ప్రారంభించి త ర్వాత మూడు కిలో వాట్ల ప్రసార శక్తి తెచ్చుకుంది. 15 ఆగస్టు 2015 నుంచి ఆదిలాబాద్ ఆకాశవాణి ఎఫ్ఎం కేంద్రంగా రూపుదిద్దుకుంది. అచ్చమైన యాస, మాండలిక పద ప్రయోగం, వాడకంతో ఎఫ్ఎం ఖ్యాతి ఎల్లలుదాటింది. ప్రతి పండుగ సంస్కృతి, ముఖ్య సంఘటనలు, కళలు ఆకాశవాణి కేంద్రం ప్రసారాలు చేస్తుంది.

### సిద్ధిధాత్రి రూపంలో సరస్వతీ అమ్మవారు

***దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాసర సరస్వతీ అమ్మవారు తొమ్మిదో రోజు సిద్ధిధాత్రి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకం అలంకరణ, మహా హారతి, తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. శనివారం ఉదయం పూర్ణహుతి కార్యక్రమం అనంతరం అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.***
***- బాసర, అక్టోబర్ 11***



సిద్ధిధాత్రి అవతారంలో అమ్మవారు













ప్రయాణికుల రద్దీతో ఆదిలాబాద్ బస్టాండ్

### బస్టాండ్లు కిటకిట..

***దసరా పండుగ సందర్భంగా ప్రజలు తమ స్వగ్రామాలకు ప్రయాణమయ్యారు. పట్నం నుంచి పల్లెల బాట పట్టారు. దీంతో శుక్రవారం ఆదిలాబాద్ బస్టాండ్ వివిధ ప్రాంతాలకు పోయే ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. పలు రూట్లలో బస్సులు జనంతో నిండిపోయాయి. కొన్ని ఊళ్లకు బస్సులు సరిపడా వేయకపోవడంతో ప్రయాణికులు వేచిచూడాల్సి వచ్చింది.***
***- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్***

### దుర్గాదేవికి మాజీ మంత్రి ప్రత్యేక పూజలు

ఎదులాపురం, అక్టోబర్ 11: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటూ తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తున్నారని, సనాతన ధర్మంలోని పండుగల ప్రాశస్త్యాన్ని భావితరాలకు తెలియచెప్పేలా వేడుకలను నిర్వహించుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లోని శాంతినగర్, కోలిపురాలోని దుర్గాదేవి మండపం వద్ద శుక్రవారం ఆయన సతీమణి రమాదేవితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ, రాజన్న, సతీశ్, శ్రీనివాస్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న







